


సీతారాముల విగ్రహాల ప్రతిష్ట

కాకుమాను : కొమ్మూరులోని రామమందిరంలో గురువారం సీతారాములు, గణనాథుడు, అభయాంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్టామహోత్సవం వైభవంగా నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 522.30 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

భక్తిశ్రద్ధలతో మహాపూర్ణాహుతి



నకరికల్లు: నర్సింగపాడులోని మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన వేడుకల్లో భాగంగా గురువారం మహాపూర్ణాహుతి, త్రిశూలస్నానం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

న్యూస్‌రీల్

రేపు విశ్రాంత ఉద్యోగులకు హెల్త్ కార్డుల పంపిణీ

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ విశ్రాంత ఉద్యోగులకు శనివారం స్థానిక బ్రాడీపేటలోని బ్యాంక్ పరిపాలన కార్యాలయంలో ఆ బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము, సీఈఓ టి.కృష్ణవేణి చేతుల మీదుగా హెల్త్ కార్డులు అందజేయనున్నట్లు విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోయిన సుబ్బారావు, బి.జగన్నాథరెడ్డి గురువారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఇఫ్‌కో టోక్యో ఇన్సూరెన్స్ కంపెనీ సౌజన్యంతో ఉదయం 9 గంటలకు మెడికల్ క్యాంప్ నిర్వహిస్తారని తెలిపారు. తర్వాత హెల్త్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. జిల్లాలోని సహకార బ్యాంక్ విశ్రాంత ఉద్యోగులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

యార్డుకు 54,198 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 54,198 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 52,487 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి 23,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,500 నుంచి 24,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 22,852 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సమస్యలుంటే టోల్‌ఫ్రీ నంబరు 1967కు కాల్ చేయండి

బాపట్లఅర్బన్: జిల్లాలోని తెల్ల రేషన్‌కార్డుదారులందరికీ ఉచితంగా బియ్యం, సబ్సిడీ ధరలపై చక్కర, కందిపప్పు, గోధుమ పిండి ప్రతినెలా ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దనే పంపిణీ చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ బాపట్ల జిల్లా అధికారి విలియమ్స్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటి వద్దనే నిత్యావసరాల పంపిణీలో భాగంగా, అధికారులు ముందుగా నిర్ణయించిన ప్రణాళిక ప్రకారం నిత్యావసరాల సరుకులను లబ్ధిదారుల ఇంటి వద్దనే సరఫరా చేయడం జరిగిందన్నారు. పంపిణీ సమయంలో ఏదైనా కారణాల వలన రేషన్ తీసుకోని కార్డుదారుల కోసం ప్రతినెలా 17వ తేదీ మధ్యాహ్నం నుంచి ఎండీయూ వాహనాన్ని సంబంధిత సచివాలయం వద్ద ఉంచి సరుకులు పంపిణీ చేస్తారన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నంబరు 1967కు తెలియజేయాలన్నారు.

దుర్గమ్మకు కానుకగా వెండి వీణ





ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు బాపట్లకు చెందిన భక్తులు గురువారం వెండి వీణను కానుకగా సమర్పించారు. బాపట్ల జిల్లా అద్దంకి మండలం తిమ్మాయపాలెంకు చెందిన టి.వెంకటేశ్వరరావు కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబును కలిసి 693 గ్రాముల వెండితో తయారు చేసిన వీణను అమ్మవారికి కానుకగా సమర్పించారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అందజేయగా, చైర్మన్ అమ్మవారి ప్రసాదాలు, చిత్రపటం, శేషవస్త్రాలతో సత్కరించారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.1,200, గరిష్ట ధర రూ.2,000, మోడల్ ధర రూ.1,700 వరకు పలికింది.

మందహాసం

బ్రహ్మనాయుడు చాటిన సర్వమానవ సమానత్వ స్ఫూర్తి వెల్లివిరిసింది. పల్నాడు రణక్షేత్రం ప్రభంజనమై పరవళ్లుతొక్కింది. 'మంద'హాసంతో కదంతొక్కింది. వీరావేశపు వెల్లువలో ఓలలాడింది. వీర్ల అంకాలమ్మ తల్లికి కత్తిసేవలతో నీరాజనాలు పలికింది. జై చెన్నకేశవ అంటూ నినదించింది.

వైభవంగా మందపోరు
- రణక్షేత్రంలో ఉప్పొంగిన వీరావేశం
- చాపకూడును ప్రారంభించిన ప్రభుత్వ విప్ పీఆర్కే
- 10 వేల మంది సహపంక్తి భోజనాలు



చెన్నకేశవ ఆలయానికి భారీ ఆయుధంతో వెళ్తున్న వీరాచారవంతులు

కారెంపూడి: పల్నాటి వీరారాధనోత్సవాలలో భాగంగా గురువారం కారెంపూడిలో జరిగిన 'మంద పోరు' ఉత్సాహంగా సాగింది. వీరాచారవంతులు ఆయుధాలతో వీరంగమాడారు. కత్తులతో ఒంటిపై సేవలు చేసుకున్నారు. వీరావేశం వెల్లువెత్తింది. మహిళలు పొంగళ్లు చేసుకుని వీరుల ఆయుధాలు వెంట వెళ్లి అంకాలమ్మ తల్లి, చెన్నకేశవస్వామికి మొక్కులు చెల్లించారు. వీరుల ఆయుధాలకు గ్రామోత్సవం నిర్వహించారు. ఆయుధాల (దైవాలు)కు ప్రజలు నీరాజనాలు పలికారు. కొందరు ఆచారవంతులు ఎవరికి వారు ప్రత్యేకంగా తమ కొణతాలతో వీర్ల అంకాలమ్మ వద్దకు వీర బుట్టలతో తరలివెళ్లి అంకాలమ్మ, చెన్నకేశవస్వామికి మొక్కులు చెల్లించారు. పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ ఆశీస్సులు తీసుకున్నారు. రణక్షేత్రం యావత్తు జై చెన్నకేశవ నామస్మరణతో మార్మోగింది. అంకాలమ్మ దర్శనానికి వీరాచారవంతులతోపాటు ప్రజలు కూడా పోటెత్తారు.

వెల్లివిరిసిన సమతావాదం

మధ్యాహ్నం వీరుల గుడి ఆవరణలోని బ్రహ్మనాయుడు చాపకూడు మండపంలో అలనాడు అమలు చేసిన సహపంక్తి భోజనాల(చాపకూడు)ను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే), పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవతో కలిసి పూజలు చేసి చాపకూడును ప్రారంభించారు. పీఆర్కే ప్రజలకు స్వయంగా వడ్డించారు.



చాపకూడులో పాల్గొన్న ఎమ్మెల్యే పిన్నెల్లి

ముందుగా సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. అన్ని కులాలు, మతాలకు చెందిన వ్యక్తులతో కలిసి కూర్చుని పీఆర్కే భోజనం చేశారు. సుమారు 10 వేల మంది చాపకూడు భోజనాలు చేశారు. తహసీల్దార్ శ్రీనివాస్, సర్పంచ్ ప్రమీలాభాయి తేజానాయక్, జెడ్పీటీసీ సభ్యులు షఫీ, ఎంపీపీ శారదాశ్రీనివాసరెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అక్బర్, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ అధ్యక్షులు సుబ్రమణ్యం, అల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారిక ఉత్సవాలుగా జరుపుకుందాం

పీఆర్కే మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పల్నాటి ఉత్సవాలను అధికారికంగా జరుపుకుందామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టిలో ఈ విషయం ఉందని చెప్పారు. ఇప్పటికే ప్రభుత్వ సహాయ సహకారాలు కొనసాగుతున్నాయన్నారు. రాబోయే రోజుల్లో అన్ని సౌకర్యాలూ కల్పించి ఉత్సవాలు ఇంకా ఘనంగా నిర్వహిద్దామన్నారు.

వేడుకగా కన్నమదాసు విగ్రహావిష్కరణ

మాచర్ల సర్వ సైన్యాధ్యక్షుడు, పల్నాటి యోధుడు కన్నమదాసు విగ్రహాన్ని పీఆర్కే ఆవిష్కరించారు. కన్నమదాసు సేవా సమితి, దాతల సహకారంతో కన్నమదాసు మండపం పక్కనే విగ్రహాన్ని నెలకొల్పారు. విగ్రహావిష్కరణ అనంతరం గ్రామోత్సవంలో ఉన్న ఆయుధాల (దైవాలు)కు పీఆర్కే పూజలు చేశారు. వీరాచారవంతులు నృసింహకుంతాన్ని పీఆర్కేపై వాల్చి ఆశీస్సులు అందించారు. అనంతరం వీరుల గుడికి వెళ్లి అక్కడ వీరుల ఆయుధాలకు పూజలు చేశారు. వీరుల గుడి ప్రాంగణంలో వీరాచారవంతులు కత్తి సేవలతో పీఆర్కేకు ఆశీస్సులందించారు.

నేడు కోడిపోరు

ప్రధాన ఉత్సవం కోడిపోరు శుక్రవారం జరగనుంది. అలనాడు బ్రహ్మనాయుడు, నాగమ్మల మధ్య జరిగిన కోడిపోరును వీరుల గుడి ఆవరణలో సంప్రదాయం కోసం నిర్వహించనున్నారు. పీఆర్కేతోపాటు గుంటూరు మేయర్ మనోహర్‌నాయుడు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి హాజరుకానున్నారు. కాపు సంఘం ఆహ్వానం మేరకు వంగవీటి మోహన్‌రంగా విగ్రహాన్ని ఆవిష్కరించి అనంతరం ప్రభుత్వం నిర్మించిన కాపు కమ్యూనిటీ భవనాన్ని పీఆర్కే ప్రారంభించనున్నారు.

ఏపీ సీఐడీకి అరుదైన గౌరవం

- 'ఆపరేషన్ స్వేచ్ఛ' అమలుకు అవార్డు
- తమిళనాడు ప్రభుత్వం నుంచి స్వీకరణ
- సీఐడీ ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్పీ సరితను అభినందించిన రాష్ట్ర డీజీపీ, సీఐడీ ఏడీజీ



తమిళనాడు మహిళా కమిషన్ చైర్‌పర్సన్ కుమారి చేతుల మీదగా అవార్డు స్వీకరిస్తున్న ఎస్పీ సరిత

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఆంధ్రప్రదేశ్ క్రైం ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సీఐడీ)కి అరుదైన గౌరవం లభించింది. ఈనెల 11న తమిళనాడు రాష్ట్రం తాజ్‌కోరోమండల్‌లో 'గ్లోబల్ ట్రెండ్స్ ఇన్ క్రైం ఏగైనిస్ట్ ఉమెన్' అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు జరిగింది. సదస్సుకు ఏపీతోపాటు దేశంలోని వివిధ రాష్ట్రాలు, విదేశాల నుంచి పోలీస్, మహిళా, శిశు/సంక్షేమ శాఖ ఇతరత్రా విభాగాల ఉన్నతాధికారులు హాజరై ప్రసంగించారు. ఏపీ నుంచి సీఐడీ ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్పీ కేజీవీ సరిత ప్రజెంటేషన్ ఇచ్చారు. ఏపీలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించేందుకు చేపడుతున్న 'ఆపరేషన్ స్వేచ్ఛ' పనితీరును గణంకాలతో సహా వివరించారు. ఏపీలో ఈ ఏడాది ఫిబ్రవరి 9న రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఆపరేషన్ స్వేచ్ఛ లక్ష్యాలను వెల్లడించారు. దాదాపు నాలుగు దఫాలుగా చేపట్టిన ఈ ఆపరేషన్ స్వేచ్ఛలో వందలాది మంది బాల కార్మికులను రక్షించామని, ఇందులో ఏపీతోపాటు పొరుగు రాష్ట్రాలకు చెందిన వారిని గుర్తించామని, ఇప్పటి వరకు 1,506 మంది చిన్నారులను గుర్తించగా, అందులో 897 మందిని రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి విద్యాబుద్ధులు చెప్పిస్తున్నామని ఆమె వివరించారు. అలాగే మానవ అక్రమ రవాణ నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలు, మహిళా రక్షణ కోసం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న దిశ యాప్, వార్డు/ గ్రామ మహిళా పోలీస్ వ్యవస్థ గురించి కూడా వెల్లడించారు. మన బడి నాడు–నేడుతోపాటు మహిళలు, బాలల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలపై ప్రసంగించారు. దీనికిగాను 'ఆపరేషన్ స్వేచ్ఛ'కు నేతృత్వం వహించిన ఎస్పీ కేజీవీ సరిత తమిళనాడు ప్రభుత్వం/మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ఏఎస్ కుమారి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ ఈ అవార్డు ఏపీ ప్రభుత్వానికి దక్కిందని చెప్పారు. పోలీస్, కార్మిక శాఖ, ఎన్‌జీఓస్ ఇతరత్రా శాఖల సమన్వయంతో బాల కార్మికులను రక్షించామని చెప్పారు. ఈ సందర్భంగా కేజీవీ సరితను రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, సీఐడీ అడిషనల్ డీజీ సంజయ్ గురువారం మంగళగిరి డీజీపీ, సీఐడీ కార్యాలయంలో అభినందించారు. ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఏపీ సీఐడీ ఆదర్శంగా నిలిచిందని ప్రశంసించారు.

13 మందికి నర్సింగ్ ట్యూటర్స్‌గా పదోన్నతి

గుంటూరు మెడికల్: ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలు, ప్రభుత్వ నర్సింగ్ స్కూళ్లలో ఖాళీగా ఉన్న నర్సింగ్ ట్యూటర్ గ్రేడ్–2 పోస్టులను ప్రమోషన్ కౌన్సెలింగ్ ద్వారా గురువారం భర్తీ చేశారు. గుంటూరులోని ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్టాఫ్‌నర్సులుగా పనిచేస్తూ బీఎస్సీ నర్సింగ్ అర్హత ఉన్నవారికి కౌన్సెలింగ్ నిర్వహించినర్సింగ్ ట్యూటర్లుగా ప్రమోషన్ ఇచ్చారు. ఉమ్మడి మూడు జిల్లాల్లో 20 పోస్టులకుగాను 13 మంది ఉద్యోగోన్నతి పొందారు.

ఐదుగురికి పబ్లిక్ హెల్త్ నర్సుగా ఉద్యోగోన్నతి

ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో మల్టీ పర్పస్ హెల్త్ సూపర్‌వైజర్ (ఎంపీహెచ్‌ఎస్ ఫీమేల్)గా పనిచేస్తున్న వారికి గురువారం గుంటూరులోని మెడికల్ అండ్ హెల్త్ రీజనల్ డైరెక్టర్ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించి పబ్లిక్ హెల్త్ నర్సుగా ప్రమోషన్ ఇచ్చారు. ఉమ్మడి మూడు జిల్లాల్లో తొమ్మిది మందిని ప్రమోషన్ కౌన్సెలింగ్‌కు పిలువగా, కేవలం ఐదుగురు మాత్రమే ప్రమోషన్ ఆర్డర్ తీసుకున్నారు. మిగతా నలుగురు పదోన్నతి వద్దంటూ లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల్లో నియామకం

సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు కేంద్ర కార్యాలయం ప్రకటన

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లాకు చెందిన కొంతమంది నాయకులను రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీల్లో నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ కమిటీలో ఉపాధ్యక్షుడిగా కేఎం జోసెఫ్, అధికారిక స్పోక్స్ పర్సన్‌గా పి.ముత్యం, కార్యదర్శిగా జి.ప్రకాష్, సంయుక్త కార్యదర్శిగా ఎస్.బాలరాజు నియమితులయ్యారు. స్టేట్ మైనార్టీ సెల్ కమిటీలో కార్యదర్శిగా షేక్ ఖాదర్‌బాషా, స్టేట్ రైతు విభాగం కమిటీ జోనల్ ఇన్‌చార్జి (జోన్–5)గా గడికోట కోటేశ్వరరావు, స్టేట్ వాణిజ్య విభాగం కమిటీలో ఉపాధ్యక్షుడిగా కొత్త కోటేశ్వరరావు, జోన్–5 జోనల్ ఇన్‌చార్జిగా మాజేటి వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా పోరిశెట్టి సురేష్, సంయుక్త కార్యదర్శిగా వెలుగూరి శరత్ బాబులను నియమించారు. రాష్ట్ర చేనేత కమిటీలో జోన్–5 జోనల్ ఇన్‌చార్జిగా అవ్వారు అన్నపశెట్టి, కార్యదర్శిగా నీలి తులసిరామ్, సంయుక్త కార్యదర్శిగా బిట్రా రాజేంద్రప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా అవ్వారు సుబ్బారావు నియమితులయ్యారు.

విద్యార్థి విభాగం జోనల్ ఇన్‌చార్జిగా మనోహర్

వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కమిటీలో పల్నాడు జిల్లాకు చెందిన కొంతమందిని వివిధ హోదాల్లో నియమించారు. బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయం విడుదల చేసిన ప్రకటన మేరకు గంగుల మనోహర్‌యాదవ్‌ను పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల జోనల్ ఇన్‌చార్జిగా నియమించగా, కార్యదర్శిగా గుజ్జర్లపూడి ఆకాష్, సంయుక్త కార్యదర్శిగా ఆళ్ల మణికంఠరెడ్డి నియమితులయ్యారు.

గుంటూరు జిల్లాలో పలువురి నియామకం

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడిగా గుంటూరు జిల్లాకు చెందిన గంజి చిరంజీవిని, కార్యదర్శిగా పి.శ్రీరామకృష్ణను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. అదేవిధంగా బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా కాంద్రు కమల, ప్రధాన కార్యదర్శిగా ఓర్సు శ్రీనివాసరావు, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా చేబ్రోలు మనోరంజని, కార్యదర్శిగా డాక్టర్ వై.శ్రీకాంత్‌లను నియమించారు. రాష్ట్ర మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జిగా (జోనల్–4) షేక్ జానీ (జిలాని), అధికార ప్రతినిధిగా షేక్ దస్తగిరి, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అన్నపరెడ్డి బ్రహ్మానందారెడ్డి, రాష్ట్ర వాణిజ్య విభాగం అధికార ప్రతినిధిగా దేవరశెట్టి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా నంబూరి వీరబ్రహ్మం, కార్యదర్శిగా కొల్లా గురునాథ్ గుప్తాలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యార్థి విభాగం అధికార ప్రతినిధిగా భానుచరణ్

పెదకాకాని: వైఎస్సార్ సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం అధికార ప్రతినిధిగా పెదకాకాని గ్రామానికి చెందిన బండ్లమూడి భాను కిరణ్ నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయ వర్గాలు ఓ ప్రకటన విడుదల చేశాయి.

బాపట్ల జిల్లాలో పలువురికి పదవులు

బాపట్ల అర్బన్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగం కమిటీలలో బాపట్ల జిల్లాకు చెందిన పలువురికి స్థానం కల్పిస్తూ పార్టీ అధిష్టానం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కమిటీ సెక్రటరీగా మోతుకూరి హరి బాబు, క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర కమిటీ జోనల్ ఇన్‌చార్జిగా డేవిడ్ మనోహర్, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ మోపర్తి మేరీ ఉమన్ సరళ, మైనారిటీ సెల్ రాష్ట్ర కమిటీ జోనల్ ఇన్‌చార్జిగా (జోన్–5)గా షేక్ ఇమామ్, వాణిజ్య విభాగం రాష్ట్ర కమిటీ జాయింట్ సెక్రటరీగా బొమ్మిశెట్టి వెంకటరత్న గుప్తా, రాష్ట్ర వీవర్స్ వింగ్ కమిటీ అఫీషియల్ స్పోక్స్ పర్సన్‌గా జంజనం శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీగా రవి అవ్వారు, సెక్రటరీగా పట్టెం శ్రీనివాసరావు నియమితులయ్యారు.

బల్క్ అప్లికేషన్లు తీసుకోబడవు

బాపట్ల జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: జిల్లాలో కొత్తగా ఓటర్ల చేర్పులు, తొలగింపులకు సంబంధించి బల్క్ అప్లికేషన్లు తీసుకోబడవని కలెక్టర్ పి.రంజిత్‌బాషా స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో గురువారం రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల నమోదు, తొలగింపుల కోసం బల్క్ అప్లికేషన్‌లు ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఓటర్ల నమోదు, తొలగింపుల కోసం ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో, ఈఆర్‌ఓ, బీఎల్‌ఓల వద్ద నమోదు చేసుకోవచ్చన్నారు. జనవరి 5న ఓటర్ల జాబితా ప్రచురిస్తామని తెలిపారు. ఆ తర్వాత కూడా ఓటు నమోదు చేసుకోవచ్చన్నారు. ఈవీఎం మిషన్లపై ఓటర్లకు అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు ఓటు నమోదు, తొలగింపు, మార్పుల కోసం 1,81,126 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. విచారణ జరిపి 20,827 దరఖాస్తులు తిరస్కరించినట్లు తెలిపారు. 1.31 లక్షల దరఖాస్తులు అనుమతించి ఓటరు జాబితాలో చేర్చినట్లు తెలిపారు. ఇంకా 28,506 దరఖాస్తులు పెండింగులో ఉన్నాయన్నారు. త్వరలో వాటిపై విచారణ జరిపి ఓటరు జాబితా ప్రచురించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో రాజకీయపార్టీల నాయకులు ఇనగలూరి మాల్యాద్రి, ఎస్.భగత్‌సింగ్, కె.వి.రామకృష్ణ, గంగయ్య పాల్గొన్నారు.

నమోదుకు వడివడిగా నడి'చేను'

- ఈనెల 18 నాటికి పంట నష్టం నమోదు పూర్తి...
- సంక్రాంతిలోగా ఇన్‌పుట్ సబ్సిడీ
- వరికి హెక్టార్‌కు రూ.17,000
- తడిచిన ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు
- 80 శాతం సబ్సిడీతో వెంటనే శనగ విత్తనాలు



పంట నష్టం నమోదును పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ రాజకుమారి

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రైతులను ఆదుకునేందుకు జిల్లా యంత్రాంగం శరవేగంగా ఎన్యూమరేషన్ కార్యక్రమం చేపట్టింది. మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో జిల్లాలో పంటలు బాగా దెబ్బతిన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోంది. తాజాగా ఈనెల 11 నుంచి పంటల నష్టం నమోదును ప్రారంభించింది. 18 వరకు ఈ ప్రక్రియ సాగనుంది. అప్పటి నుంచి 22 వరకూ జాబితాలను సచివాలయాల్లో ప్రదర్శించి సోషల్ ఆడిట్ నిర్వహిస్తారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిశీలించి తుది జాబితాను ఈనెల 26న ప్రదర్శిస్తారు. 33 శాతం కంటే ఎక్కువ దెబ్బతిన్న పంటలను పరిగణనలోకి తీసుకుంటారు. వీటికి సంక్రాంతి నాటికి ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడానికి రంగం సిద్ధంచేస్తున్నారు. మళ్లీ నాట్లు వేయడానికి అవకాశం ఉన్న వారికి 80 శాతం సబ్సిడీతో శనగ విత్తనాలను అందజేయనున్నారు. సబ్సిడీపై శనగ విత్తనాలు అందించడం కోసం పది వేల మెట్రిక్ టన్నులు అవసరమని గుర్తించారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. వచ్చిన వెంటనే పంపిణీ చేయనున్నారు. వ్యవసాయ, ఉద్యాన పంటల్లో నష్టాన్ని అంచనా వేసేందుకు గ్రామ స్థాయిలో పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది బృందాలుగా ఏర్పడి పనిచేస్తున్నారు. ఒక రైతుకు రెండు హెక్టార్ల వరకు మాత్రమే గరిష్టంగా ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లిస్తారు. వరి, మిరప, వేరుశనగ, చెరుకు, పత్తి, పసుపు, కూరగాయలు, ఉల్లిపాయలు, పూలు, బొప్పాయి, పుచ్చకాయల పంటలకు హెక్టార్‌కు రూ.17 వేలు ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించాలని నిర్ణయించారు. మొక్కజొన్నకు రూ.12,500, పొగాకుకు రూ.10 వేలు, అరటికి రూ. 25 వేలు ఇవ్వనున్నారు.

ప్రాథమిక నష్ట అంచనాలు ఇలా..

పంటలు	విస్తీర్ణం హెక్టార్లలో
వరి	41,852
మిరప	10,219
శనగ	8,580
మినుము	2,876
పొగాకు	1,300
పత్తి	1,054
జొన్న	1,046
అరటి	764
కూరగాయలు	397
మొక్కజొన్న	155
తమలపాకు	152
పూలు	47
కంది	25

అందరికీ న్యాయం

మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులందరికీ న్యాయం చేస్తాం. తడిచిన ధాన్యం కొనుగోలు చేస్తాం. త్వరలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. ఎన్యూమరేషన్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

– జి.రాజకుమారి, జాయింట్ కలెక్టర్, గుంటూరు

మిచాంగ్ తుఫాన్ సమయంలో పలుచోట్ల ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాల్లో 259 కుటుంబాలకు ఆశ్రయం కల్పించారు. వారందరికీ 25 కిలోలు బియ్యం కేజీ చొప్పున నూనె, బంగాళదుంపలు, ఉల్లి అందించి ఇళ్లకు పంపారు. ఈ కుటుంబాలకు రూ.2,500 చొప్పున మొత్తం రూ.ఐదు లక్షల రెండు వేలు చెల్లించారు. జిల్లాలో ప్రత్తిపాడు, పొన్నూరు, తుళ్లూరుల్లో మూడు పశువులు చనిపోతే ఒక్కో పశువుకు 37,500 చొప్పున ఇప్పటికే పరిహారం చెల్లించారు.

వెలసిల్లిన సంపత్తి

- సీసీఐ కేంద్రానికి భారీగా తరలింపు
- గరిష్ట మద్దతు ధర క్వింటాకు రూ.7,020
- ఆనందంలో కర్షకులు



గణపవరం సీసీఐ కేంద్రం వద్ద బారులు తీరిన పత్తి లోడు ట్రాక్టర్లు

నాదెండ్ల: గణపవరంలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రానికి రైతులు ట్రాక్టర్లతో భారీగా పత్తిని తరలిస్తున్నారు. ప్రస్తుతం సీసీఐ మద్దతు ధర క్వింటాకు గరిష్టంగా రూ.7,020లు ఉండగా, బహిరంగ మార్కెట్లో రూ.5,500–6,000 వరకూ మాత్రమే ఇస్తున్నారు. దీంతో రైతులు కొద్దిరోజులుగా సీసీఐ కేంద్రానికి భారీగా పత్తిని తరలిస్తున్నారు. ఫలితంగా యడ్లపాడు మండలం తిమ్మాపురంలోని తిరుమల కాటన్‌లో మరో కేంద్రాన్ని ప్రారంభించారు. యడ్లపాడులోని మరో మిల్లులోనూ కొనుగోలు చేస్తున్నారు.

ఇప్పటి వరకూ 25 వేల క్వింటాళ్ల కొనుగోలు

చిలకలూరిపేట సీసీఐ పరిధిలోని మూడు కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకూ సుమారు 25 వేల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు బయ్యర్ రమేష్ తెలిపారు. తేమ శాతం 8లోపు ఉన్నట్లయితే పూర్తి మద్దతు ధర లభిస్తుందన్నారు. తేమ శాతం 11 వరకూ ఉన్నా కొంటామని, ప్రతి శాతానికి రూ.70.20 తగ్గిస్తున్నట్టు వివరించారు. రైతులు పత్తిని బ్యాగుల్లో, లూజు రూపంలో తీసుకు వస్తున్నారని, ఎక్కడ వీలైతే అక్కడ అమ్మే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. అయితే ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేసి ఉండాలని పేర్కొన్నారు. ఎకరాకు 9 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. వారం, పది రోజుల్లో రైతుల ఖాతాలకు నేరుగా ఆర్‌టీజీఎస్ ద్వారా చెల్లింపులు జమ చేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

అధ్యాపక ఉద్యమ నాయకుడు లక్ష్మీనారాయణ మృతి



గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ, అధ్యాపక హక్కుల ఉద్యమ నాయకుడు చందర్లపాటి లక్ష్మీనారాయణ అనారోగ్యంతో గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మరణించారు. ఉపాధ్యాయ, అధ్యాపక ఉద్యమ నేత, మాజీ ఎమ్మెల్సీ ఎంజే మాణిక్యరావు అనుయాయుడిగా అవిశ్రాంత పోరాటంతో పాటు స్వగ్రామంలో వాటర్ ప్లాంటు నిర్మాణం చేపట్టిన లక్ష్మీనారాయణ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్‌గా సుపరిచితులేనని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన ఆకస్మిక మృతి పట్ల ఎమ్మెల్సీ లక్ష్మణరావుతో పాటు ఎన్వీ నరసింహారావు, బీఎస్ఎన్ఎల్ యూనియన్ నాయకులు చందర్లపాటి వెంకటేశ్వర్లు, వివిధ అధ్యాపక సంఘాల నాయకులు సంతాపాన్ని తెలియజేశారు.

రూ. 89 వేలు మాయం

రెంటచింతల: మండలంలోని రెంటాల గ్రామంలో సైబర్ నేరం చోటుచేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు పి.పరమేశ్వరరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పోస్టుద్వారా తనకు ఇటీవల ఒక లెటర్ వచ్చిందని, దానిలో ఓ కంపెనీ 8వ వార్షికోత్సవం సందర్భంగా డ్రా తీయగా మీకు టీవీ, వాషింగ్ మిషన్, సెల్‌ఫోన్, రిఫ్రిజిరేటర్, ల్యాప్‌టాప్‌తోపాటు నగదు బహుమతి, కారు, స్కూటర్ వచ్చినట్లు ఆ లేఖలో పేర్కొన్నారన్నారు. దీనికిగాను ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్ను కింద రూ.89,840 నగదును చెల్లించిన వెంటనే వస్తువులు పంపడం జరుగుతుందని లెటర్‌లో తెలపగా, తాను వెంటనే నగదును పంపించినట్లు బాధితుడు వాపోయాడు. నగదు చెల్లించినా, ఇప్పటి వరకు సామగ్రి రాలేదని, ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో అనుమానం వచ్చి సైబర్‌క్రైం పోలీసులకు ఈ నెల 11న ఫిర్యాదు చేసినట్లు పరమేశ్వరరెడ్డి తెలిపారు.

డీఆర్ఎం కార్యాలయంలో ఇంధన పొదుపు వారోత్సవాలు



లక్ష్మీపురం(గుంటూరువెస్ట్): గుంటూరు రైల్వే డివిజన్ కార్యాలయంలో ఇంధన పొదుపు వారోత్సవాలు (ఎనర్జీ కన్జర్వేషన్)నిర్వహించడం ఆనందదాయకం అని డీఆర్ఎం ఎం.రామకృష్ణ అన్నారు. స్థానిక పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఇంధన పొదుపు వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ప్రతి ఏటా డిసెంబర్ 14న ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. తొలుత డివిజన్ పరిధిలోని ఆయా విభాగాధిపతులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం కె.సైమన్, శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంట నష్టం నమోదుకు పటిష్ట విధానం

కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: మిచాంగ్ తుఫాను కారణంగా జిల్లాలో జరిగిన పంటనష్టాన్ని పటిష్ట విధానాలతో అంచనా వేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి నిర్వహించిన వీడియో సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎన్యుమరేషన్ కార్యక్రమాలను నిర్వహించేందుకు మండల, జిల్లా స్థాయి అధికారులతో కమిటీలు వేసి నిరంతరం ప్రవేక్షిస్తున్నామనీ, నష్టపోయిన పంట వివరాలను ఈ నెల 18లోపు పూర్తి చేస్తామని కలెక్టర్ వివరించారు. ఆడిట్ కోసం 22వ తేదీన అన్ని సచివాలయాల్లో వాటి వివరాలు నమోదు చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం జారీ చేసిన నిబంధనల ప్రకారం అభ్యంతరాలను స్వీకరించి తుది జాబితా 26న ప్రభుత్వానికి అందజేస్తామని కలెక్టర్ వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు, జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు, జిల్లా ఉద్యాన శాఖాధికారి రవీంద్ర, అధికారులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనులు వేగవంతం చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: నాడు–నేడు రెండో దశలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం గుంటూరు నగర పరిధిలోని ఏటీ అగ్రహారం ఎస్‌కేబీఎం, స్తంభాల గరువులోని చేబ్రోలు మహాలక్ష్మి–పుల్లయ్య, కేపీపీ కాలనీలోని కేఎస్సార్టీ, వేణుగోపాల్‌నగర్‌లోని కోన బాల ప్రభాకరరావు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయా పాఠశాలల్లో నాడు–నేడు ద్వారా పూర్తయిన పనుల్లో నాణ్యతా ప్రమాణాలతో పాటు పురోగతిలో ఉన్న ఆధునీకరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా పూర్తి నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. కలెక్టర్ వెంట డీఈవో పి.శైలజ, డీవైఈవో పి.వెంకటేశ్వరరావు, గుంటూరు పశ్చిమ తహసీల్దార్ సాంబశివరావు, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, సమగ్రశిక్ష అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో పంట పదిలం



వరి పంటను పరిశీలిస్తున్న రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్

తాడేపల్లిరూరల్: ప్రకృతి వ్యవసాయంతో పంట పదిలం అని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్ అన్నారు. గురువారం మంగళగిరి రూరల్ పరిధిలోని పెదవడ్లపూడి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన వరి, కంపాక్ట్ బ్లాక్ ఆరు ఎకరాలు, ఎస్సీ కౌలు రైతులు సేద్యం చేస్తున్న క్షేత్రాన్ని ఆయన సందర్శించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి పీఎండీఎస్ వేసుకోవడం ద్వారా ప్రకృతి విపత్తులను తట్టుకోవచ్చని, అందరు ప్రకృతి వ్యవసాయం చేసి పంటను రక్షించుకుని ప్రకృతి విపత్తుల నుంచి నష్టపోకూడదని రైతులకు సూచించారు. వరిపంట కోసి తర్వాత మొక్కజొన్నలో అంతర పంటలు మినుములు, పెసర, అలసంద, గోరు చిక్కుడు లాంటి పంటలు, జొన్న సజ్జలను సరిహద్దు పంటలుగా వేసి ఎక్కువ లాభాలు ఆర్జించాలని రైతులకు వివరించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి, డీఎల్ఎంపీ సత్యనారాయణ, సైన్స్ టీమ్ యశస్వి, కల్పన, జిల్లా సిబ్బంది ఎస్ఎఫ్‌లు, ఎంటీలు, నాగకృష్ణ, శ్యామ్‌బాబు, యూనిట్ ఇన్‌ఛార్జిలు రాహేల్ రావు, ప్రకాశ్‌రావు, రైతులు రత్నరాజు, కిరణ్, జగ్గారావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడితే సహించేది లేదు

డీఎస్‌వో ఈబీ విలియమ్స్



భట్టిప్రోలు: రేషన్ సరఫరాలో ఎండీయూ ఆపరేటర్లు అవినీతికి పాల్పడితే సహించేది లేదని జిల్లా పౌర సరఫరా శాఖాధికారి (డీఎస్‌వో) ఈబీ విలియమ్స్ హెచ్చరించారు. గురువారం ఆయన భట్టిప్రోలు విచ్చేశారు. ఇటీవల ఎండీయూ ఆపరేటర్లు రేషన్‌ను పక్కదారి పట్టిస్తున్న విషయంపై విచారణ చేపట్టేందుకు ఇక్కడకు వచ్చారు. విలియమ్స్ మాట్లాడుతూ జనవరి ఒకటో తేదీ నుంచి ఎండీయూ ఆపరేటర్లతోపాటు వలంటీర్లు కూడా వాహనం వెంట ఉండే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అవినీతికి పాల్పడితే శాఖాపరంగా చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట సీఎస్‌డీటీలు ఓంకార్, రవీంద్ర, తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జి ఎంఆర్ఐ శివరామకృష్ణ తదితరులు ఉన్నారు.

గోనె సంచుల గోడౌన్‌లో అగ్నిప్రమాదం

నరసరావుపేట రూరల్: మండలంలోని చినతురకపాలెంలో బుధవారం రాత్రి గోనెసంచుల గోడౌన్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో దాదాపు రూ.10 లక్షల ఆస్తినష్టం జరిగింది. పెదతురకపాలెం రోడ్డులో గ్రామానికి చెందిన ముజావర్ మాబు సుభానికి చెందిన గోనెసంచుల గోడౌన్ ఉంది. అర్ధరాత్రి సమయంలో గోడౌన్ నుంచి పొగలు రావడం గమనించిన స్థానికులు అప్రమత్తమై మంటలను అదుపు చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

క్యాన్సర్ కణితి తొలగించిన జీజీహెచ్ వైద్యులు



జీజీహెచ్ వైద్యులను సన్మానిస్తున్న దేవినాయుడు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో అతి పెద్ద కణితిని తొలగించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. ప్రకాశం జిల్లా పామడ్రుకు చెందిన పద్మారావు క్యాన్సర్‌తో బాధపడుతూ ఈనెల 4న జీజీహెచ్‌లో చేరినట్లు వెల్లడించారు. 2015లో హైదరాబాద్‌లో క్యాన్సర్ గడ్డ తొలగించారని, కొత్తలో తొలగించిన గడ్డ మరలా తిరిగి రావడంతో సుమారు రూ.5 లక్షలు ఖరీదు చేసే ఆపరేషన్‌ను జీజీహెచ్ క్యాన్సర్ వైద్యులు ఉచితంగా చేశారన్నారు. ఆపరేషన్ ప్రక్రియలో క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ జహ్నవి, డాక్టర్ పోతిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నట్లు వెల్లడించారు. ఐదురోజుల క్రితం జరిగిన ఆపరేషన్ ప్రక్రియలో పొట్టలో ఉన్న 20–15 సైజులో ఉన్న కణితి తొలగించామన్నారు. రోగి ఆరోగ్యం నిలకడగా ఉండటంతో గురువారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేస్తున్నట్లు వెల్లడించారు. సుమారు రూ. 5 లక్షల ఆపరేషన్‌ను ఉచితంగా చేసి రోగి ప్రాణాలు కాపాడిన జీజీహెచ్ వైద్యులను, ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను కారుణ్య సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు దేవినాయుడు గురువారం సత్కరించారు. కార్యక్రమంలో నాట్కో సమన్వయకర్త యడ్లపాటి అశోక్‌కుమార్, హైకోర్టు న్యాయమూర్తి బాలాజీనాయుడు, ఈశ్వర్, పద్మావరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటు వేయడం పౌరుల బాధ్యత

- తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ
- కేఎల్‌యూలో అవగాహన సదస్సు



ప్రసంగిస్తున్న సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ

తాడేపల్లిరూరల్: ఓటు వేయడం పౌరుల నైతిక బాధ్యత అని సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ స్పష్టం చేశారు. గురువారం స్థానిక కె.ఎల్.విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటర్ల అవగాహనా సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ ఉందని, రాజ్యాంగ బద్ధంగా అధికారాన్ని చేపట్టే ప్రజాప్రతినిధులను ప్రతీ ఒక్కరూ బాధ్యతగా తమ ఓటు ద్వారా ఎన్నుకుని తమ ప్రాంతం అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలు తమ సమస్యలను పరిష్కరించగలిగే నాయకులను గుర్తించి వారికి తమ ఓటు ద్వారా మద్దతు తెలిపితే గెలిచిన ప్రజాప్రతినిధులు ప్రజల అవసరాలను తీరుస్తారని పేర్కొన్నారు. నా ఒక్క ఓటు వేయకపోతే ఏం కాదులే అనే నిర్లక్ష్యం ఓటర్లకు పనికిరాదని, ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఓటు అవసరమేనని, గెలుపు ఓటములను నిర్ణయించడానికి ఒక్క ఓటు చాలని గుర్తు చేశారు. యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థులు స్థానికంగా ఓటు నమోదు చేసుకుని, చివరి సంవత్సరం పరీక్షలు పూర్తయ్యే వరకు ఇక్కడే ఓటు ఉపయోగించుకోవచ్చని స్పష్టం చేశారు. కె.ఎల్.యు.రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు మాట్లాడుతూ ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా యువతీ యువకులందరూ ఓటును తప్పనిసరిగా వినియోగించుకుని మంచి నాయకులను, ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవాలని సూచించారు. విద్యార్థులు ఓటు అనే ఆంగ్ల అక్షరమాలతో పాటు అతి పెద్ద మానవహారాలుగా ఏర్పడి అందరినీ ఆకర్షించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా డిప్యూటీ కలెక్టర్ కె. స్వప్న, మంగళగిరి నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రార్ లక్ష్మి కుమారి, తాడేపల్లి మండల డిప్యూటీ తహసీల్దార్ సతీష్, వడ్డేశ్వరం వీఆర్‌వో ఆషా, గుండిమెడ వీఆర్‌వో మల్లిఖార్జున రెడ్డి, వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్స్‌లర్లు ఎ.వి.ఎస్. ప్రసాద్, ఎన్. వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సి.హెచ్.హనుమంతరావు, ప్రిన్సిపల్ డాక్టర్ టి.రామకృష్ణ, డీన్ సలహాదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్, డాక్టర్ కె.ఆర్.ఎస్.ప్రసాద్, అసోసియేట్ డీన్ డాక్టర్ కె. రూతు రమ్య, సాక్ డైరెక్టర్ సాయి విజయ్, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరోజు విజిబుల్ పోలీసింగ్

- జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ ఆదేశం
- జగనన్నకు చెబుదాం ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్, చిత్రంలో ఏఎస్పీలు

నగరంపాలెం: జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజూ ఉదయం సాయంత్రం వేళల్లో పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్, రైల్వే స్టేషన్లతోపాటు ముఖ్యమైన ప్రాంతాల్లో పర్యటించి విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ ఆదేశించారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో నేర సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని రౌడీషీటర్లను బైండోవర్ చేయాలన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని చెప్పారు. ప్రతీకదలిక, నడతను, ప్రవర్తనశైలిని గమనించాలని సూచించారు. ఎన్డీపీఎస్, ఎక్సైజ్ కేసులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. సీఎం వై.ఎస్.జగన్ ఇటీవల ప్రారంభించిన జగనన్నకు చెబుదాం (స్పందన) ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన 10 లీటర్ల లోపు పట్టుబడిన మద్యం కేసుల (ఎక్సైజ్)ను జిల్లా ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో పరిష్కరించుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. దీర్ఘకాల పెండింగ్ కేసులు, 2020- 2023లో ఇప్పటి వరకు నమోదైన కేసులను త్వరగా దర్యాప్తు చేయాలని ఆదేశించారు. జిల్లా పోలీస్ యంత్రాంగం విధి నిర్వహణలో నిజాయితీగా పనిచేయాలన్నారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితుల పట్ల మర్యాదగా మెలగాలని చెప్పారు. రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, పోక్సో చట్టం, మహిళా/ అదృశ్య కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. గంజాయి విక్రయాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని, జైళ్ల నుంచి విడుదలైన పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో రాత్రి గస్తీ నిర్వహించాలని సూచించారు. ఏఎస్పీలు కె.సుప్రజ (పరిపాలన), ఎ.శ్రీనివాసరావు (క్రైం), డీఎస్.మహేష్ (సెబ్), డీఎస్పీలు ఉమా మహేశ్వరరెడ్డి (గుంటూరు పశ్చిమ), మహబూబ్ బాషా (దక్షిణ), పోతురాజు (తుళ్ళూరు), కేసీహెచ్.రామారావు (దిశ), శ్రీనివాస్ రావు (డీసీఆర్‌బీ), చంద్ర శేఖర్ రావు (ఏఆర్), టీ.వీ.రత్నస్వామి (ఎస్‌బీ), ఎస్‌బీ సీఐ శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ సీఐ బాలసుబ్రమణ్యం, ఆర్ఐలు థామస్‌రెడ్డి, రాజారావు, సీసీఎస్ సీఐలు, జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్పీ సీసీ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

భవిష్యత్ ప్రయోజనాల కోసమే మార్పులు, చేర్పులు

- సామాజిక సమతుల్యత దృష్ట్యా సీట్ల సర్దుబాటు
- ఏపీ నీడ్స్ జగన్ లక్ష్యంగా అధిష్టానానికి సహకరిద్దాం
- ప్రభుత్వ సలహాదారు బత్తుల



మార్టూరు: ప్రజా సంక్షేమం కోసం మరోసారి అధికారం అనివార్యం కనుక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టితో చేపట్టిన సంస్కరణల నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు శిరోధార్యంగా భావించి సహకరిద్దామని మార్కెటింగ్, కో ఆపరేటివ్ ఏపీ ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం ఆయన మార్టూరులో విలేకర్లతో మాట్లాడుతూ సంక్షేమ పథకాల ప్రయోజనాలు కుల, మత, పార్టీలకతీతంగా పారదర్శకంగా లబ్ధిదారులకు నూరు శాతం అందజేయడం గతంలో మనం ఏపీలో చూడలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వంతోనే అది సాధ్యమైందన్నారు. గత ప్రభుత్వం బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే పరిగణిస్తే, బీసీలను ప్రత్యేకంగా ఎంబీసీలను గుర్తించి, 56 కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి 720 మంది డైరెక్టర్లను నియమించి వారికి అధికారంలో భాగస్వామ్యం కల్పించింది తమ ప్రభుత్వమేనన్నారు. కరోనా సమయంలో ఆర్థిక ఒడిదుడుకులను తట్టుకొని ప్రజలకు అందించిన సేవలతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడం, ఉద్యోగ అవకాశాలు కల్పించడంలోను సీఎం జగన్ ఆదర్శంగా నిలిచారన్నారు. గతంలో జన్మభూమి కమిటీల ద్వారా సంక్షేమ పథకాలు దళారీ వ్యవస్థల ద్వారా లబ్ధిదారులకు వారికి అందేవికావన్నారు. నేడు వలంటీర్ వ్యవస్థ ద్వారా నూరు శాతం నేరుగా లబ్ధిదారులు బ్యాంకు ఖాతాల్లో జమకావడాన్ని ఎవరైనా ఆక్షేపించగలరా అని అన్నారు.

త్యాగాలు తప్పనిసరి..

ఇటువంటి సంక్షేమ రాజ్యం మరోసారి అధికారంలోకి రావాలంటే త్యాగాలు తప్పవని ఆయన హితవు పలికారు. సామాజిక సమతుల్యత సాధించడం కోసం సీఎం కొంత మంది ఎమ్మెల్యేలు, మంత్రులను తప్పించి వారి స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పించి అధికారంలో భాగస్వాములను చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. గెలుపే లక్ష్యంగా మరోసారి విజయ సాధించేందుకు సమష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

నవోదయంలో 260 దరఖాస్తులు స్వీకరణ



ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలు అందజేస్తున్న జేసీ శ్యాంప్రసాదు

నరసరావుపేట: కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాల్‌లో గురువారం నిర్వహించిన నవోదయంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల నుంచి 260 దరఖాస్తులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున విద్య, ఉపాధి, వ్యాపారం, బ్యాంకు రుణాల కోసం నిరుద్యోగ యువకులు, మహిళలు తరలివచ్చారు. దరఖాస్తులను సంబంధిత బ్యాంకులు, ఉద్యోగాలు అవసరమైన లబ్ధిదారులకు ఆయా కంపెనీల ప్రతినిధులు వద్దకు పంపించగా, వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికైన 60 మంది అభ్యర్థులకు జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారిచే ఉచిత భోజనాలను ఏర్పాటు చేశారు. సాంఘిక సంక్షేమశాఖ పీడీ, నవోదయం అధికారి ఓబుల్ నాయుడు, నోడల్ ఆఫీసర్ సంజీవ్‌రావు, పలువురు ఎంపీడీఓలు, సచివాలయ సిబ్బంది, కలెక్టరేట్ స్టాఫ్, ఆయా కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు.

పరిషత్తులకు జీవంపోసే నవ'వేదిక'



వేదిక సంస్థ నూతనంగా ఎన్నికైన సభ్యులు

- తెలుగు నాటక కళా పరిషత్తుల సమ్మేళన సంస్థ ఏర్పాటు
- వేదిక చైర్మన్‌గా ముత్తవరపు సురేష్‌బాబు ఎన్నిక

యడ్లపాడు: తెలుగు నాటకరంగం కనుమరుగు కాకుండా దాని ఖ్యాతిని భావితరాలకు అందించాలనే సంకల్పంతో 'వేదిక'(తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళన) సంస్థ ఏర్పాటైంది. యడ్లపాడు గ్రామంలో గురువారం ఆ సంస్థ నూతన కమిటీ సభ్యుల ఎంపిక జరిగింది. వేదిక(తెలుగునాటక కళా పరిషత్తుల సమ్మేళన) సంస్థ గౌరవ సలహాదారుడిగా డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, చైర్మన్ ముత్తవరపు సురేష్‌బాబు, డిప్యూటీ చైర్మన్ చిట్టినేని సాయిబాబు, ప్రధాన కార్యదర్శి జేవీ మోహన్‌రావు, కార్యదర్శి కట్టా శ్రీహరిరావు, కోశాధికారి జి.పాండురంగారావు, సంయుక్త కార్యదర్శి పోపూరి నాగేశ్వరరావు, అన్ని కళాపరిషత్తుల ప్రతినిధుల్ని కార్యనిర్వాహక సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. కార్యక్రమంలో పుచ్చలపల్లి సుందరయ్య నాటకోత్సవాల కమిటీ(యడ్లపాడు), కొండవీడు కళా పరిషత్(లింగారావుపాలెం), ఎన్టీఆర్ కళా పరిషత్(అనంతవరం), లావు వెంకటేశ్వర్లు, కల్లూరి నాగేశ్వరరావు కళా పరిషత్(వరగాని), శ్రీకారం, రోటరీ కళా పరిషత్(మార్టూరు), లలిత కళానికేతన్ (తక్కెళ్లపాడు), శ్రీ కళానికేతన్(వీరన్నపాలెం) పరిషత్ నిర్వాకులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సుందరయ్య కళా పరిషత్ నిర్వాహకులు ముత్తవరపు సురేష్‌బాబు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ కళా పరిషత్‌ల నిర్వహణ ఓ యజ్ఞంగా భావించి ఏటాక్రమం తప్పకుండా ఎన్నో ఒడిదుడుకుల్ని ఎదుర్కొంటూ పోటీలను ప్రదర్శింపజేసే వాటిని మరింత బలోపేతం చేయడమే ఈ వేదిక లక్ష్యం అన్నారు.

ఫ్యాషన్

సంప్రదాయ వేడుకలకు గ్రాండ్‌గా తయారవ్వాలంటే అతివలు ఎంచుకునే మొదటి ఎంపిక లంగా ఓణీ లేదా గాగ్రా చోలీ అవుతుంది. ఎంబ్రాయిడరీ లాంటి రిచ్ డిజైన్స్ లేవు అనుకునేవారు రీసెంట్‌గా ఆకట్టుకుంటున్న డిజిటల్ ప్రింట్ డిజైన్స్‌ని ఎంపిక చేసుకోవచ్చు. పురాణ గాథలు, ఫ్లోరల్, గ్రామీణ వాతావరణం నింపుకున్న డిజిటల్ డిజైన్స్ రిచ్‌లుక్‌తో అట్రాక్ట్ చేస్తున్నాయి.

డిజిటల్ మెరుపులు







మెటీరియల్

సంప్రదాయ వేడుకలకు తక్కువ ఖర్చుతో ఎక్కువ కళగా సొంతం చేసుకోవాలనుకునేవారు ఈ డిజిటల్ ప్రింట్ డిజైన్స్‌ను ఎంచుకోవచ్చు. వీటిలో మెటీరియల్, డిజైన్ బట్టి ధరలు వేల రూపాయల నుంచి మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. రెడీ టు వేర్‌గానూ ఉన్న ఈ డిజైన్స్ అమ్మాయిలను, అమ్మలనూ ఆకట్టుకుంటున్నాయి.

కలంకారీ ప్రింట్స్

చందేరీ ఫ్యాబ్రిక్‌పైన పెన్ కలంకారీ మాత్రమే కాదు కలంకారీ ప్రింట్స్ కూడా కొత్త ఊపిరి పోసుకుంటున్నాయి. హ్యాండ్‌మేడ్ చేయించుకోవడానికి టైమ్ పడుతుంది అనుకునే వారు రెడీ టు వేర్‌గా ఉన్న కలంకారీ లెహంగా చోలీ డిజైన్స్‌ను ఎంచుకోవచ్చు.

పట్టుపైనా...

పట్టు లెహంగాలు ఎప్పుడూ రిచ్ లుక్‌ని ఇస్తాయి. అయితే, వీటిని మరింత గ్రాండ్‌గా తీర్చిదిద్దడానికి డిజిటల్ ప్రింట్స్ సందడి చేస్తున్నాయి. దుపట్టా, బ్లౌజ్, లెహంగా లు కొత్త లుక్‌తో మెరిసిపోతున్నాయి. సంప్రదాయ వివాహ వేడుకలు, పండుగల రోజుల్లో ఇవి కొత్త ప్రత్యేకతను నింపుకుంటున్నాయి.

వంటిల్లు

రంగు రంగుల రుచులు

ఈ క్రిస్టమస్‌కు సులభంగా... త్వరగా చేసుకోదగిన రుచికరమైన కుకీస్ ఈ వారం


క్రిస్టమస్ సాఫ్ట్ కుకీస్



కావలసినవి: మైదా – మూడున్నర కప్పులు; వంటసోడా – టీస్పూను; ఉప్పు – అర టీస్పూను; పంచదార – ఒకటిన్నర కప్పులు; బటర్ – కప్పు; గుడ్లు – రెండు; వెనీలా ఎసెన్స్ – రెండు టీస్పూన్లు.

తయారీ: ● మైదా, వంటసోడా, ఉప్పుని ఒక గిన్నెలో వేసి కలిపి పక్కన పెట్టుకోవాలి ● బటర్‌లో పంచదార వేసి క్రీమ్‌లా మారేంత వరకు బీటర్‌తో కలపాలి. తరువాత ఈ క్రీమ్‌ను రెండు గంటలు రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి ● రెండు గంటల తరువాత బటర్ క్రీమ్‌లో గుడ్లసొన, వెనీలా ఎసెన్స్, మైదా మిశ్రమం వేసి ముద్దగా కలుపుకోవాలి ● పిండి ముద్దను రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి ● రెండు గంటల తరువాత పిండి ముద్దను రొట్టెల్లా వత్తుకోవాలి ● ఈ రొట్టెను క్రిస్టమస్ ట్రీ, స్టార్స్, బొమ్మల ఆకారంలో కట్ చేసి బేకింగ్ ట్రేలో పెట్టాలి. కుకీస్ ఆకారాన్ని బట్టి ఫుడ్ కలర్ వేసుకోవచ్చు ● ఈ బేకింగ్ ట్రేను 400 డిగ్రీల ఫారిన్ హీట్ వద్ద పదినిమిషాలు బేక్ చేస్తే ఎంతో రుచికరమైన క్రిస్టమస్ సాఫ్ట్ కుకీస్ రెడీ.


స్నీకర్ డూడుల్ కుకీస్



కావలసినవి: మైదా – మూడు కప్పులు; టార్టారిక్ యాసిడ్ – రెండు టీస్పూన్లు; కోషర్ సాల్ట్ – టీస్పూను; వంటసోడా – ముప్పావు టీస్పూను; బటర్ –కప్పు; పంచదార – ఒకటిన్నర కప్పులు; వెనీలా ఎసెన్స్– టీస్పూను; దాల్చినచెక్క పొడి – టేబుల్ స్పూను.

తయారీ: ● పెద్దగిన్నెలో మైదా, టార్టారిక్ యాసిడ్, వంటసోడా వేసి కలపాలి ● అన్నీ కలిసిన తరువాత బటర్, ఒకటింబావు కప్పుల పంచదార వేసి మెషిన్ మిక్సర్‌తో కలపాలి ● మిశ్రమం క్రీమ్‌లా మారిన తరువాత వెనీలా ఎసెన్స్ వేసి కలిపి రిఫ్రిజిరేటర్‌లో ఉంచాలి ● మిగిలిన పంచదారలో దాల్చినచెక్క పొడి వేసి బాగా కలిపి పక్కన పెట్టుకోవాలి ● గంట తర్వాత రిఫ్రిజిరేటర్‌నుంచి తీసిన మిశ్రమాన్ని రెండు టేబుల్ స్పూన్ల చొప్పున తీసుకుని బాల్స్‌లా చేసి దాల్చినచెక్క పొడి అద్ది బేకింగ్ ట్రేలో పెట్టాలి ● కుకీస్ అన్నీ తయారయ్యాక.. బేకింగ్ ట్రేని 350 డిగ్రీల ఫారిన్ హీట్స్ వద్ద, ఇరవై నిమిషాలు బేక్ చేస్తే స్నీకర్ డూడుల్ కుకీస్ రెడీ.

ఇటాలియన్ పీచ్ కుకీస్



కావలసినవి: మైదా – మూడున్నర కప్పులు; వంటసోడా – టేబుల్ స్పూను; కోషర్ సాల్ట్ – పావు టీస్పూను; బటర్ – అరకప్పు; పంచదార – రెండు కప్పులు; గుడ్లు – రెండు కప్పులు; వెనీలా ఎసెన్స్ – రెండు టీస్పూన్లు; పాలు – కప్పు; ఎరుపు, పసుపు ఫుడ్ కలర్ – నాలుగు చుక్కలు (ఒక్కోటి రెండు చుక్కలు). పీచ్ బటర్ క్రీమ్: బటర్ – పావు కప్పు; వెనీలా ఎసెన్స్ – అర టీస్పూను; కోషర్ సాల్ట్ – చిటికెడు; పంచదార పొడి – కప్పు; పీచ్ ప్యూరీ – రెండు టేబుల్ స్పూన్లు.

తయారీ: ● ఒక గిన్నెలో వంటసోడా, ఉప్పు వేసి కలపాలి ● దీనిలో బటర్, కప్పు పంచదార వేసి క్రీమ్‌లా మారేంత వరకు హ్యాండ్ మిక్సర్‌తో కలపాలి. తరువాత క్రీమ్‌ను పక్కన పెట్టుకోవాలి ● మిక్సర్‌ను తక్కువ స్పీడ్‌లో పెట్టి గుడ్ల సొన, వెనీలా ఎసెన్స్ వేసి రెండు నిమిషాలు బీట్ చేసుకోవాలి ● తరువాత మైదా, బటర్ మిశ్రమం అరకప్పు పాలు పోసి అన్ని చక్కగా కలిసేంత వరకు బీట్ చేయాలి ● ఇప్పుడు ఈ మిశ్రమాన్ని స్కూప్ పరిమాణంలో తీసుకుని గుండ్రని బాల్స్‌లా చేసి పైన కొద్దిగా వత్తి పీచ్ ఫ్రూట్ ఆకారంలోకి తీసుకు రావాలి ● ఇలా అన్ని కుకీస్ రెడీ అయిన తరువాత అవెన్‌లో పెట్టి 350 డిగ్రీల ఫారిన్ హీట్స్ వద్ద పదిహేను నిమిషాలు బేక్ చేయాలి ● పీచ్ క్రీమ్‌కోసం తీసుకున్న బటర్, వెనీలా ఎసెన్స్, కోషర్ సాల్ట్ లనుగిన్నెలో వేసి హ్యాండ్ మిక్సర్‌తో కలపాలి ● ఇవన్నీ చక్కగా కలిపిన తరువాత మిక్సర్ స్పీడు తగ్గించి పంచదార పొడి, పీచ్ ప్యూరీవేసి మీడియం హై లో నిమిషం పాటు మిక్సర్‌తో కలపాలి ● మిగిలిన అరకప్పు పాలను రెండు సగాలుగా చేసి రెండు వేర్వేరు గిన్నెల్లో పోయాలి. ఒకదానిలో ఎరుపు, మరో దానిలో పసుపు ఫుడ్ కలర్ వేసి కలిపి పక్కన పెట్టుకోవాలి. మరోగిన్నెలో మిగిలిన పంచదారను పెట్టుకోవాలి ● కుకీస్ బేక్ అయిన తరువాత..వేడిగా ఉన్నప్పుడే కుకీస్ మధ్యలో చిన్న గాటు పెట్టి.. మధ్యలో పీచ్‌క్రీమ్‌ను వేసి శాండ్‌విచ్‌లా కొద్దిగా వత్తాలి ● ఇప్పుడు కుకీకి ఒకవైపు ఎరు రంగు కలిపిన పాలు, మరోవైపు పసుపు రంగు కలపిన పాలు అద్దాలి. చివరిగా పంచదార అద్దితే ఇటాలియన్ పీచ్ కుకీస్ రెడీ.

గ్రీన్ కేక్ మిక్స్ కుకీస్



కావలసినవి: వెనీలా కేక్ మిక్స్ – మూడు కప్పులు; నూనె – ముప్పావు కప్పు; గుడ్లు – రెండు; వెనీలా ఎసెన్స్ – అరటీస్పూను; గ్రీన్ ఫుడ్ కలర్ – టీస్పూను(జెల్); పంచదార పొడి – ముప్పావు కప్పు; హార్ట్ షేప్ క్యాండీస్ – గార్నిష్‌కు సరిపడా.

తయారీ: ● కేక్ మిక్స్,నూనె, గుడ్ల సొన, వెనీలా ఎసెన్స్‌ను, గ్రీన్‌ఫుడ్ కలర్‌ను ఒక గిన్నెలో వేసి ముద్దలా కలపాలి. తరువాత రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి ● ఇరవై నిమిషాల తరువాత పిండి ముద్దను బయటకు తీసి స్కూప్ పరిమాణంలో పిండిని తీసుకుని ఉండలు చేయాలి ● ఈ ఉండలను పంచదారపొడిలో ముంచి కోటింగ్‌లా అద్దాలి ● తరువాత ఉండలను బేకింగ్ ట్రేలో పెట్టి, కుకీ షేప్ వచ్చేలా వత్తుకోవాలి ● కుకీ మధ్యలో హార్ట్ ఆకారంలో ఉన్న క్యాండీని పెట్టి బేకింగ్ ట్రేని అవెన్‌లో పెట్టాలి ● 350 డిగ్రీల ఫారిన్ హీట్స్ వద్ద పదిహేను నిమిషాలు బేక్ చేస్తే గ్రీన్ కేక్ మిక్స్ కుకీస్ రెడీ.

సుగర్ కుకీస్



కావలసినవి: బటర్ – పావు కప్పు; క్రీమ్ చీజ్ – పావుకప్పు; పంచదార – ఒకటిన్నర కప్పులు; గుడ్లు – రెండు; వెనీలా ఎసెన్స్ – ఒకటిన్నర టీస్పూన్లు; బాదం ఎసెన్స్ – పావు టీస్పూను; మైదా – రెండున్నర కప్పులు; కార్న్‌స్టార్చ్ – టేబుల్ స్పూను; వంటసోడా – టీస్పూను; ఉప్పు – పావు టీస్పూను; ఎరుపు, పచ్చరంగు కలిపిన పంచదార –గార్నిష్‌కు సరిపడా.

తయారీ: ● ఒక పెద్దగిన్నెలో బటర్, క్రీమ్ చీజ్, పంచదార, గుడ్లు, వెనీలా, బాదం ఎసెన్స్ వేసి హ్యాండ్ మిక్సర్‌తో ఐదు నిమిషాలపాటు కలపాలి ● తరువాత మైదా, కార్న్ స్టార్చ్, వంటసోడా, ఉప్పు వేసి పిండి ముద్దలా కలపాలి ● ఈ పిండి ముద్దను రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి ● రెండు గంటల తరువాత తీసి చిన్నచిన్న ఉండలుగా చేసి బేకింగ్ ట్రేలో పెట్టాలి ● ఫోర్క్ సాయంతో ఉండపైన ఇంటూ ఆకారంలో ముద్ర పడేటట్లు వత్తాలి ● ఇలా అన్నిటినీ వత్తుకున్నాక ఎరుపు, పచ్చరంగు పంచదారను ఈ కుకీస్ పైన చల్లాలి ● ఇప్పుడు బేకింగ్ ట్రేని అవెన్‌లో పెట్టి 350 డిగ్రీల ఫారిన్ హీట్స్ వద్ద పదిహేను నిమిషాలు బేక్ చేస్తే సుగర్ కుకీస్ రెడీ.

మీ బద్ధకం అమ్మకు భారమే

చలికాలం ముసుగు తన్ని పడుకుంటే
ఎంత బాగుణ్ణు.
బెడ్ దగ్గరకు పొగలు గక్కే టీ వస్తే
ఎంత బాగుణ్ణు.
టిఫిన్లూ, సూప్‌లు,
సాయంత్రం ఉడకబెట్టిన పల్లీలు...
ఎంత బాగుణ్ణు.
అన్నట్టు రగ్గులు, బొంతలు
భలే శుభ్రంగా, పొడిగా ఉండాలండోయ్.
చలికాలం ఎవరికీ పని చేయబుద్ధేయని కాలం.
కాని అమ్మకు తప్పుతుందా?
అమ్మ వెచ్చని రగ్గు కప్పుకుని టీవీ చూస్తూ
'టీ తెండి' అని అరిస్తే ఒకరోజైనా
ఇస్తారా ఎవరైనా?
చలికాలంలో ఇంటి సభ్యులు ఏం చేయాలి?



స్కూల్ టైమ్ మారదు. ఉదయం 8 లోపు బస్సొచ్చి ఆగుతుంది. పిల్లలకు బాక్స్ కట్టివ్వడమూ తప్పదు. ఏడున్నరకంతా కట్టాల్సిందే. టిఫిన్ తినిపించాల్సిందే. ఎంత చలి ఉన్నా, ఎంత మంచు కమ్ముకున్నా, ఎంత బద్ధకంగా ఉన్నా, ఎంత ముసుగుతన్ని నిద్రపోవాలని ఉన్నా అమ్మకు తప్పుతుందా? అమ్మ లేవకుండా ఉంటుందా? వంట గదిలో వెళ్లకుండా ఉంటుందా? నాన్న అర గంట లేటుగా లేవొచ్చు. వాకింగ్ ఎగ్గొట్టి అమ్మ ఇచ్చిన టీని చప్పరిస్తూ పేపర్‌ను చదువుతూ ఉండొచ్చు. కాని అమ్మ మాత్రం అదే వంట చేయాల్సిందే. రోజువారీ అంట్లు, బట్టల ఉతుకుడు చూడాల్సిందే. ఆమెకు ఇంట్లో నుంచి ఎలాంటి సాయం అందుతున్నదో ఆలోచించామా ఎప్పుడైనా?

బద్ధకమైన కాలం ఇది

చలికాలం బద్ధకం కాలం. తలుపులు కిటికీలు మూసుకుని అరచేతులు రుద్దుకుంటూ కూచోమని చెప్పే కాలం. బబ్బుంటే బాగుండు అనిపించే కాలం. అమ్మకు 'ఈ పూట ఎవరైనా వంట చేసి పెడితే బాగుండు' అనిపించినా అలా చేసేవారు ఎవరు? 'రోజూ వండుతున్నావ్ కదా ఇవాళ బజారు నుంచి వేడి ఇడ్లీ తెస్తానులే' అని బండి తాళం అందుకునే నాన్నలు ఎందరు? పాలల్లో కొన్ని చాకోస్ వేసివ్వు చాలు అనే పిల్లలు, బ్రెడ్ ఆమ్లేట్ చేసుకుని తింటాలే అనే భర్తలు ఉన్న ఇల్లు ఇల్లాలి శ్రమను గుర్తించే ఇల్లు. 'కాసేపు పడుకోలే' అని లేచి పేపర్లు లోపల పడేసి, పాలు ఫ్రిజ్‌లో పెట్టి, ఒక ప్యాకెట్ గిన్నెలో వేడి చేసి, కాఫీ కలిపి భార్యను లేపితే ఎంత బాగుంటుంది. మగవాళ్లు బట్టలు ఎలాగూ ఉతకరు. 'చెమ్మగా ఉన్నాయి' అని విసుక్కునే బదులు కనీసం ఎండ తగిలే తీగ దాకానో, డాబా మీదనో తీసుకెళ్లి ఆరేసే సాయం చేయరు. ఇలాంటి సమయంలో 'బట్టలు ఆరేయడం' అనే చిన్న పని కూడా చాలా పెద్ద సాయం కిందకు వస్తుంది.ఈ రోజుల్లో ప్రత్యామ్నాయ టిఫిన్లు, ఇన్‌స్టంట్ టిఫిన్లు ఎన్నో మార్కెట్‌లో ఉన్నాయి. యూట్యూబ్‌లో కొడితే వందలాది వీడియోలు ఉన్నాయి. తెచ్చిపెట్టే స్విగ్గి, జొమాటోలు ఉన్నాయి. ఈ శీతాకాలంలో ఉదయపు వంట చెర నుంచి అమ్మకు ఏ విధంగా ఉపశమనం ఇవ్వొచ్చో తప్పక ఆలోచించాలి.

అమ్మకు కావాలి వెచ్చని దుస్తులు

సాధారణంగా ఇళ్లల్లో నాన్నకు హాఫ్ స్వెటర్లు ఉంటాయి. ఎప్పుడూ వేసుకునే ఉంటాడు. అమ్మకు మాత్రం ఎందుకనో స్వెటర్ ఉండదు. కొని తేవాలని ఎవరికీ అనిపించదు. చాలా ఇళ్లల్లో అమ్మలు పాతబడిన స్వెటర్లతోనే తిరుగుతూ ఉంటారు ఈ సీజన్లలో. ఒక రంగురంగుల కొత్త స్వెటర్ కొనుక్కోవాలని వారికి ఉంటుంది. ఉద్యోగం చేస్తున్నా, గృహిణి అయినా తాను కొనుక్కునే చొరవకు ఎప్పుడూ అమ్మ దూరంగానే ఉంటుంది. స్వెటర్ లేకుండానే చలికాలం గడిపేస్తుంది. ఆమెకు స్వెటర్, సాక్సులు, స్కార్ఫ్‌లు కావాలి. ఉన్నాయా గమనించండి. ఆమె అడగదు. తెచ్చి పెట్టండి. శీతాకాలంలో స్త్రీలు తమ శరీరం గురించి ఆలోచన చేస్తారు. చర్మాన్ని, శిరోజాల్ని కాపాడుకోవడానికి వారికి కొన్ని వస్తువులు అవసరం. క్రీములు. నూనెలు. సబ్బులు... ఏర్పాటు చేయాలి. చర్మ సమస్యలు కొందరిలో రావచ్చు. వాటిని చిట్కాలతో సరిపుచ్చుతూ బాధ పడాల్సిన పని లేదు. వైద్యుల దగ్గరకు వెళ్లాలి. తీసుకువెళ్లాలి. ఇక ఇంట్లో గర్భిణీ స్త్రీలు ఉంటే చలికాలం మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. రోజువారీ చాకిరీ నుంచి దాదాపుగా తప్పించాలి.

ఇంట్లో పెద్దవారు ఉంటే?

అమ్మమ్మో, నానమ్మో ఇంట్లో ఉంటే వారి గురించి ఇల్లంతా మరింత శ్రద్ధ పెట్టాలి. మంచి షాల్, రగ్గు వారికి ఏర్పాటు చేయాలి. నేలకు పాదాలు తాకి జిల్లు మనకుండా ఇంట్లో తిరగడానికి మంచి స్లిప్పర్లు ఇవ్వాలి. స్లిప్పర్లలోనే తిరగమని చెప్పాలి. చలికి ఆకలి ఎక్కువ. పెద్దవారు పసిపిల్లల్లా మారి నోటికి హితంగా వేడివేడిగా అడుగుతారు. వారికి ఏదో ఒకటి చేసి పెట్టాలి. ఆ పనిలో కూడా అమ్మకు భర్త, పిల్లలు ఏదో ఒక మేరకు సాయం చేయాలి. వారికి వెచ్చని గది కేటాయించాలి. లేదా ఇంట్లోని వెచ్చని ప్రదేశమైనా.


శుభ్రత అందరిదీ

శీతాకాలం ఇల్లు మబ్బుగా ఉంటుంది. ఇటు పుల్ల అటు పెట్టబుద్ధి కాదు. కాని ప్రయత్నం చేసి ఇల్లు ప్రతి రోజూ సర్దుకునే పడుకోవాలి. హాల్లో బెడ్‌రూముల్లో కిచెన్‌లో కుటుంబ సభ్యులంతా నిద్రకు ముందు వీలైనంత శుభ్రంగా, సర్ది పడుకుంటే ఉదయాన్నే అమ్మ లేచినప్పుడు చిందరవందర లేకుండా పనిలో పడబుద్ధి అవుతుంది. పక్క బట్టలు మడవడం కూడా కొంతమంది చేయరు. అలాంటి వారిని తప్పక గాడిలో పెట్టాలి. చలికాలం అమ్మకి పని తేలిక చేద్దాం. చలికాలాన్ని ఎంజాయ్ చేసేలా చూద్దాం.

● ముగ్గు-ముచ్చట

ముగ్గులకు ఆహ్వానం

ధనుర్మాసం వచ్చిందంటే ఇంటిముంగిట తీర్చిదిద్దిన అందమైన రంగవల్లులు... ముచ్చటైన గొబ్బెమ్మలు... తెలుగింటి ఆడపడచులందరూ తమకు వచ్చిన ముగ్గులను మరొకరితో



పంచుకుంటూ... తెలియని వాటిని నేర్చుకుంటూ కనిపిస్తుంటారు. మరి మీరు కూడా ముగ్గులు బాగా వేస్తారా? అలా అయితే ముచ్చటైన మీ ముగ్గులను అందమైన రంగులతో కాగితం మీద పెట్టండి. చుక్కల వివరాలతో సహా వాటిని మాకు పంపండి. అందిన వాటిలో చక్కటి ముగ్గును మీ ఫొటోతో సహా మేము ప్రచురిస్తాం.

ముగ్గులు పంపవలసిన చిరునామా
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్–34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com